క్లుప్తంగా

27న మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

కందుకూరు: మండలంలోని నేదునూరు తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశానికి ఈ నెల 27న అర్హత ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విష్ణుప్రియ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో చేరడానికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి వరకు చేరడానికి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. మార్చి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 22వ తేదీ మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్ష సమయానికి 45 నిమిషాల ముందుగానే పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. హాల్ టికెట్, పరీక్ష ప్యాడ్, బాల్ పెన్నులు, వాటర్ బాటిల్ తమ వెంట తీసుకురావొచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



లబ్ధిదారురాలికి చెక్కు అందిస్తున్న నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని సాయిరెడ్డి గూడకు చెందిన గోరింక పద్మమ్మ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే సబితారెడ్డి చొరవతో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.33వేలు మంజూరయ్యాయి. కాగా దానికి సంబంధించిన చెక్కును సోమవారం స్థానిక నాయకులు ఎస్.గోవర్ధన్, నర్సింహ, శ్రీను తదితరులు లబ్ధిదారురాలికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీశైలం, పి.రవి, టి.శేఖర్, ఎం.బాల్‌రాజ్, జి.శ్రీనివాస్, ఎం.భిక్షపతి, పి.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల పంపిణీ అధికారులే చేపట్టాలని వినతి



ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కందుకూరు: ప్రభుత్వ పథకాల పంపిణీని ప్రజాప్రతినిధులు లేక అధికారులు మాత్రమే లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి మండల పరిధిలోని నేదునూరుకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటయ్య, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు ఏవైనా కూడా ప్రజాప్రతినిధులు లేనిచోట తప్పనిసరిగా అధికారులే లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. ఇటీవల చాలా గ్రామాల్లో పార్టీల నాయకులు, కొందరు మాజీ ప్రజాప్రతినిధులే లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, యాదయ్య, రవీందర్‌గౌడ్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

సీఐ నరహరి



విద్యార్థినులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కేశంపేట: పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని సీఐ నరహరి అన్నారు. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన బీటెక్ విద్యార్థినులు చలసాని ప్రతిక, చలసాని హన్సికలు వాటర్ ప్లాంట్‌ను అందించారు. దీనిని సీఐ, పాఠశాల ఉపాధ్యాయులు, బీటెక్ విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవాగుణంను కలిగి ఉండాలని సూచించారు. అనంతరం వాటర్ ప్లాంట్ అందించిన బీటెక్ విద్యార్థినులను ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ చెదురువెల్లి భాస్కర్‌గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు నాగరాజు, మధుసూదన్‌రెడ్డి, శ్రీశైలం, జంగయ్య, ముత్యాలు, ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో పశువులు జాగ్రత్త!

- చల్లటి ప్రదేశాల్లో పశువులను కట్టేయాలి
- పశుపాక, కొట్టాలలో ఉత్తర, దక్షిణం వైపు ఓపెన్‌గా ఉంచాలి
- నీటిలో కొంత బెల్లం, ఉప్పు వేసి తాగించాలి
- పాడి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణుల సూచన



మహేశ్వరంలో డెయిరీలో ఉన్న పశువులు

మహేశ్వరం: వేసవి ఉష్ణోగ్రతలు గతేదాది కన్నా ఈ సారి అధికంగా నమోదయ్యే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత, అధిక ఉష్ణోగ్రత, వేడిగాలులతో పాడిపశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు వడదెబ్బకు గురవుతాయి. ఈ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను దుబ్బచర్ల పశువైద్యాధికారి డా.విశ్వేశ్వర్ వివరించారు.

వడదెబ్బ లక్షణాలు..

పశువుల్లో వడదెబ్బ సోకితే క్రమంగా నీరసించి, బలహీనంగా మారుతాయి. సరిగా నడవలేక తూలుతూ పడుకోవడానికి ప్రయత్నిస్తాయి. జీర్ణక్రియ తగ్గిపోవడం, ఆకలి మందగించడం, వ్యాధి నిరోధకశక్తి తగ్గటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవించే అవకాశాలున్నాయి. వాటిలో దాహం పెరుగుతుంది. ఒక్కోసారి అపస్మారక స్థితికి వెళ్లి మరణిస్తాయి.

మేత..

వేసవి తాపంతో జీర్ణక్రియ సన్నగిల్లుతుంది. పిండి పదార్థాలైన గంజి, జావ లాంటి పదార్థాలు అందించాలి. పచ్చిగడ్డి ఉదయం, ఎండిగడ్డి సమయాల్లో వేయాలి. పశుదాణాను నీటితో కలిపి ఇవ్వాలి. ఉదయం 6–10 , సాయంత్రం 5–7 గంటల సమయంలో మేపాలి.

ఆరోగ్య పరిరక్షణ

వేసవి తాపానికి గురైన పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గడంతో ఇతర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. వ్యాధి నిరోధక టీకాలు ఇది వరకు వేయించని పశువులు, గొర్రెలు, మేకల్లో గాలికుంటు, గొంతువాపు, జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. మురుగునీరు తాగటంతో పారుడు వంటి జీర్ణకోశ రోగం వచ్చే అవకాశం ఉంది. నట్టల నివారణ మందులు క్రమం తప్పకుండా తాగించాలి.

ప్రథమ చికిత్స

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రదేశంలోకి తీసుకెళ్లి శరీర ఉష్ణోగ్రత తగ్గించడానికి పలుమార్లు నీటితో కడగడం, తల నుదుటి మీద మంచుముక్కలు ఉంచడం లేదా చల్లని గోనె సంచిని దానిపై కప్పాలి. తక్షణం పశువైద్యుడిని సంప్రదించి ఆయన పర్యవేక్షణలో గ్లూకోజు సెలైన్, సోడియం క్లోరైడ్ అందించాలి. శరీర ఉష్ణోగ్రతలు తగ్గించడానికి చికిత్స చేయించాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి



వేసవి కాలంలో పశువులను జాగ్రత్తగా చూసుకోవాలి. ఈ సంవత్సరం ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. చాలా పశువులు వడదెబ్బకు గురవుతాయి. అలాంటి ప్రమాదకరమైన పరిస్థితుల్లో పశువులకు గాలివీచే ప్రదేశాల్లోకి మార్చాలి. రోజు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6:30 గంటల వరకు పశువులను బయటకు మేతకు వదలాలి. పశువుల కొట్టాలు, పాకలకు ఉత్తరం, దక్షిణం వైపు ఓపెన్‌గా ఉండే విధంగా చూసుకోవాలి. పశువుల వీపుల మీద నీటితో తడిపిన తట్టు వేయాలి. పశువులు తాగే నీటిలో కొంత బెల్లం, ఉప్పు వేసి తాగించాలి. ప్రతి రోజు పశువులను చల్లటి నీటితో శుభ్రంగా కడుక్కోవాలి. ప్రతి పాడి రైతు పశువులను జాగ్రత్తగా చూసుకోవాలి.

–డా.విశ్వేశ్వర్, పశువైద్యాధికారి, దుబ్బచర్ల

పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే

ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె



ఇన్నోవేషన్ సెల్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

షాద్‌నగర్: విద్యార్థులలో ఏదైనా సాధించాలనే కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె అన్నారు. సోమవారం పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనం ఆవరణలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ సెల్‌లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో పాటు విషయ పరిజ్ఞానంతో కూడిన విద్యనభ్యసించాలని సూచించారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. భవిష్యత్‌లో మరెన్నో సమస్యలకు సృజనాత్మకంగా ఆవిష్కరణలు చేపట్టే దిశగా విద్యార్థులు ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతీ విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా ఎదిగి నవభారత నిర్మాణంలో భగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీఐసీ కన్వీనర్ పద్మజ, ఐఐసీ కన్వీనర్ స్పందన, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సృజన, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ రమణమ్మ, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

నేలరాలిన మామిడికాయలు



లేమూరులో ఈదురుగాలులతో లేచిన పశువుల షెడ్ రేకులు

కందుకూరు: మండల పరిధిలో సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన వర్షంతో పెద్దమ్మతండాలోని మామిడి తోటలు ధ్వంసమయ్యాయి. మామడికాయలు నేలరాలాయి. కాగా ఆ తండాలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్‌కు చెందిన 9.50 ఎకరాల్లో ఉన్న మామిడి తోటల్లో కాయలు నేలరాలగా, కొన్ని చెట్లు విరిగిపోయాయి. మొక్కజొన్న, వరి పంటలకు నష్టం వాటిల్లింది. అదేవిధంగా లేమూరు గ్రామంలో ఎండీ రహీమొద్దీన్‌కు చెందిన పశువుల షెడ్ రేకులు లేచి పోయాయి. ఆ గ్రామంలోని మామిడి తోటల్లో మామిడికాయలు నేలరాలాయి. కాగా గ్రామానికి చెందిన ఎస్.నర్సింహారెడ్డి ఆవు పిడుగుపాటుకు గురై మృతి చెందింది. దాని విలువ దాదాపుగా రూ.70 వేలకు పైగానే ఉంటుందని బాధితుడు వాపోయాడు.



పెద్దమ్మతండాలో నేలరాలిన మామిడికాయలు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్, ముర్తూజగూడ, మండల పరిధిలోని నజీబ్‌నగర్, కాశీంబౌలి, అమ్డాపూర్ గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ హమునాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లకొమ్మల తొలగింపు కారణంగా శ్రీనిధి ఫీడర్, ముర్తూజగూడ ఫీడర్, విజయ్‌నవ్య ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు, అమ్డాపూర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ఆయా గ్రామాల రైతులు, విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

ఈదురుగాలులకు ఒరిగిన హోర్డింగ్

తాత్కాలికంగా రోడ్డు మూసివేత



ప్రమాదకరంగా హోర్డింగ్

శంకర్‌పల్లి: పట్టణం, మండలంలో సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో పలుచోట్ల చెట్లు విరిగిపోవడం, స్తంభాలు, హోర్డింగులు వంగిపోయాయి. పట్టణంలోని ఎస్‌బీ సూపర్‌మార్కెట్ బిల్డింగ్‌పైన అనుమతిలేని హోర్డింగ్ ఈదురుగాలుల దాటికి ప్రమాదకరంగా వంగింది. దీంతో మున్సిపల్ కమిషనర్ యోగేశ్, పరిశీలించి, అటు వైపు నుంచి సాయినగర్ కాలనీకి మార్గాన్ని తాత్కాలికంగా మూసి వేయించారు. అనుమతి లేకుండా హోర్డింగ్ పెట్టిన వారిపై చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోండి

ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి కార్పొరేషన్ అధికారులకు సూచించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్పొరేషన్‌లోని మూడు చెరువుల చుట్టూ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు నిర్వహణకు సిబ్బందిని నియమించాలన్నారు. దీంతో పాటు చెరువుల్లోని గుర్రపు డెక్కను తొలగించి శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. చందన చెరువు వద్ద నూతన మరుగుదొడ్లు నిర్మించి, మున్సిపాలిటీలోని వివిధ ప్రాంతాల్లో గతంలో ఏర్పాటు చేసిన టాయిలెట్లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తేవాలన్నారు. ముఖ్యంగా బాలాపూర్ చౌరస్తాలోని చిరు వ్యాపారులను వీధి వ్యాపార సముదాయంలోకి తరలించాలని, దీంతో పాటు రైతుబజార్ వద్ద నిర్మించిన షెడ్లను లబ్ధిదారులకు కేటాయించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. వచ్చే వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీలు, నాలాలను శుభ్రం చేయాలన్నారు. సమావేశంలో కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న ఉన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

పశువైద్యాధికారి అహ్మద్

మొయినాబాద్: పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో సోమవారం గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 245 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రసన్నకుమార్, భీంరావ్, గోరేమియా తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం మంజూరు చేయాలని వినతి



జిల్లా గ్రంథాలయ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నేతలు

నందిగామ: మండల కేంద్రానికి గ్రంథాలయం మంజూరు చేయాలని కోరుతూ స్థానికులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డికి సోమవారం కొత్తూరులో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటైన నందిగామ మండల కేంద్రంలో ఇప్పటివరకు గ్రంథాలయం లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నందిగామకు వీలైనంత తొందరలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని వారు వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహ, నాయకులు తదితరులు ఉన్నారు.

కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్



సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కందుకూరు: తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని ప్రజలు గుర్తిస్తున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్ కొనియాడారు. ఈ నెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అంటే కరువు అన్నారు. ఓ పక్క ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి, మంత్రులు టూర్లకు వెళ్తూ జల్సాలు చేస్తున్నారని ఆరోపించారు. రజతోత్సవ సభ ద్వారా మరోమారు తెలంగాణ ప్రజలకు కేసీఆర్ నాయకత్వం ఎంత అవసరమో తేటతెల్లం కానుందన్నారు. ఆ రోజు నిర్వహించనున్న సభను విజయవంతం చేసేలా ఎమ్మెల్యే సబితారెడ్డి ఆధ్వర్యంలో మండలం నుంచి భారీఎత్తున తరలివెళ్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘునాథ్‌రెడ్డి, పార్టీ మహిళా అధ్యక్షురాలు ఇందిరాదేవేందర్, డైరెక్టర్లు పి.ఆనంద్, పాండు, అనుబంధ సంఘాల అధ్యక్షులు టి.కార్తీక్, జి.సామయ్య, బి.దీక్షిత్‌రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎ.దామోదర్‌గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఎస్.ప్రకాశ్‌రెడ్డి, జ్యోతిచంద్రశేఖర్, శ్రీనివాస్, శ్రీలతశ్రీహరి, సరళజంగయ్య, ఆర్.యాదయ్య, బాలకృష్ణ, జంగయ్య, నరేందర్, లలితకుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సీడీపీఓ రేణుక



గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

బడంగ్‌పేట్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందనిహయత్‌నగర్ ప్రాజెక్ట్ అధికారి సీడీపీఓ రేణుక అన్నారు. కార్పొరేషన్ పరిధి నాదర్‌గుల్ సెక్టార్‌లోని అల్మాస్‌గూడ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహారంపై గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు విధిగా పోషకాహారాలు తీసుకుంటే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు. చిన్నారుల ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహారాన్ని చిన్నారులతో పాటు గర్భిణులు క్రమం తప్పకుండా రోజువారీ ఆహారంలో తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సూపర్‌వైజర్ జ్ఞానకుమారి, యాదగిరి, శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు ఎం.నిర్మల, బి.సత్యవతి, ఆయాలు శైలజ, టి.సురేఖ, చిన్నారుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

సీసీకెమెరాల ఏర్పాటుకు సహకారం



దాత నాగరాజును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మహేశ్వరం: నేరాల నియంత్రణకు సీసీకెమెరాలు దోహదపడతాయని చిన్న తూప్ర గ్రామ బీజేపీ అధ్యక్షుడు సంకటి నాగరాజుముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం పెద్ద తూప్ర గ్రామ శివారులో ఉన్న మల్లన్న ఆలయంలో తన సొంత నిధులతో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరిస్తామన్నారు. అనంతరం మల్లన్న ఆలయ కమిటీ సభ్యులు దాత నాగరాజును ఘనంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మల్లన్న ఆలయ కమిటీ సభ్యులు, యాదవ పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్



బ్రోచర్‌లు ఆవిష్కరిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు

షాబాద్: విద్యార్థులకు ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని బ్రోచర్‌లు ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యార్హత కలిగిన ఉపాధ్యాయులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. డిజిటల్ తరగతి బోధన, ఏఐ తరగతులు, ఎన్నో వినూత్న పద్ధతుల్లో బోధన అందిస్తున్నట్లు వివరించారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థికి గురుకుల పరీక్షల్లో జిల్లాస్థాయిలో మొదటి ర్యాంక్ రావడం సంతోషకరమని, ఆ విద్యార్థిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూర్ మల్లేశ్, మాజీ సర్పంచ్ మద్దూరు శకుంతల, ఎంపీటీసీ మాజీ సభ్యులు మద్దూరు పాండు, గుత్తి సునీత, నాయకులు రామస్వామి, చెన్నయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కొందుర్గులో గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, గ్రంథాలయ సంస చైర్మన్

కొత్తూరు: గ్రంథాయాలు విజ్ఞాన భాండాగారాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలో సుమారు రూ.82లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని ఆయన సోమవారం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం జాతీయ రహదారి నుంచి కేజీబీవీ హాస్టల్ వరకు రూ. 1 కోటితో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగుల కోసం గ్రంథాలయాల్లో ఆయా పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో నిర్వహించే పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యే విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో చదువుకున్న వారికే అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఉంటుందనే విషయాన్ని గ్రహించి లక్ష్య సాధనకు కృషి చేయాలని యువతకు సూచించారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

రాజకీయాలకు అతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. పక్కా ప్రణాళికతో కొత్తూరును రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మున్సిపాలిటీ అభివృద్ధి కోసం పెద్దమొత్తంలో నిధులు సైతం ప్రభుత్వం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, వైస్ చైర్మన్ డోలి రవీందర్, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, నర్సింహ, సురేందర్, దేవేందర్‌యాదవ్, యాదయ్య, దేవ్‌సింగ్, లైబ్రేరియన్ శ్రీనివాస్‌రాజు, మున్సిపల్ కమిషనర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

కొందుర్గు: అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయ భవన నిర్మాణం కోసం రూ.1.20 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇందుకుగాను టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. గ్రంథాలయ భవనం నిర్మాణానికి గ్రామస్తులు పెద్ది శ్రీనివాస్‌గుప్తా సోదరులు తమ తాత రామచంద్రయ్య జ్ఞాపకార్థం 600 గజాల స్థలం బహూకరించారు. ఈ సందర్భంగా స్థల దాతలను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వీరేషం, ఏఎంసీ వైస్ చైర్మన్ బాబార్, తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఎంపీడీఓ లక్ష్మిఅనురాధ, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజు, నాయకులు పాల్గొన్నారు.